

ఉద్యాన రైతులకు రాయితీలు

కుప్పంరూరల్: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కుప్పం, గుడుపల్లె మండలాల పరిధిలో పాలీహౌస్‌లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ఉద్యానపంటలు సులభంగా సాగు చేయవచ్చని సూచించారు. ప్రభుత్వం పాలీహౌస్‌లకు రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. పాలీహౌసుల్లో చేపట్టే చామంతి, గులాబి పంటలకు ఎకరాకు రూ.8.52 లక్షలు రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. క్యాప్సికమ్, దోసకాయ పంటలకు ఎకరాకు రూ.2.8 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎకరా విస్తీర్ణంలో పాలీహౌస్ కొత్తగా నిర్మాణం చేసుకుంటే రూ.36 లక్షల వరకు రాయితీ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అర ఎకరాకు రూ.18లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా సాగుచేస్తే ఎకరాకు రూ.16 వేలు ఇస్తామన్నారు. కాకర, బీర, దొండ పంటలను కర్రల ఊతం ద్వారా సాగుచేస్తే హెక్టారుకు రూ.1.870 ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు పొలాల్లో నీటికుంటలు ఏర్పాటు చేసుకుంటే 75 రాయితీ ఉంటుందన్నారు. వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీతో ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానాధికారి డింపుప్రియ పాల్గొన్నారు.


పూల తోటను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి



రతన్ టాటాకు నివాళి

కల్లూరు(పులిచెర్ల): ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా మృతికి కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు మహ్మదాలీ కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

దాతృత్వ శిఖరం ఇకలేరు

గంగవరం: రతన్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటని ఉపాధ్యాయ నేత పుష్పరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా తన ఆదాయంలో 65శాతం విద్య, వైద్యం, ఇతర సంక్షేమ రంగాలకు దానం చేశారని, అలాంటి వ్యక్తి కనుమరుగవడం బాధాకరమన్నారు.



టీడీపీ నేతపై ఎమ్మెల్యే ఫైర్

గంగవరం: మండలంలోని డ్రైవర్స్ కాలనీలో ఇళ్ల స్థలాలను టీడీపీ నేతలు ఆక్రమించి లబ్ధిదారులపై దాడులు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వార్తలు సాక్షిలో ప్రచురితమయ్యాయి. వార్తకు స్పందించిన ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి కాలనీలో జరుగుతున్న స్థలాల వివాదం గురించి తెలుసుకోవడానికి గురువారం నేరుగా కాలనీకి వెళ్లారు. అక్కడ ధ్వంసం చేసిన ఇళ్ల స్థలాల పునాదులను ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి జరిగిన విషయం అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతలు చేస్తున్న అక్రమాల గురించి బాధితులు ఎమ్మెల్యేకు చెప్పారు. వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థలాలను ధ్వంసం చేసిన శివపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే పార్టీకి నష్టదాయకమని చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్స్ కాలనీ ఉదంతంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శివకుమార్‌ను ఆదేశించారు.


శివపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

నేడు పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

పుంగనూరు: రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అభిమానులు తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10.30 గంటలకు నిర్వహించే వేడుకలకు పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

పండ్ల వితరణ

గంగవరం: పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణ సమీపంలోని రిమ్మర్స్, బుద్ధిమాంద్యం పిల్లలకు పండ్లు, స్వీట్లను న్యాయవాదులు గురువారం అందజేశారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే పురస్కరించుకుని పిల్లలకు పండ్లు అందించినట్టు వారు పేర్కొన్నారు. న్యాయవాదులు ఎల్.భాస్కర్, మహేశ్వరి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు చంద్రహారం సమర్పణ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం కమతంపల్లెకు చెందిన విజయ్‌కుమార్, చైతన్య దంపతులు రూ.1.30 లక్షల విలువ చేసే చంద్రహారాన్ని గురువారం సమర్పించారు. హారాన్ని ఈఓ ఏకాంబరానికి అందజేసి అమ్మవారికి అలంకరణ చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. దాత కుటుంబసభ్యులను ఈఓ సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఆదాయంలో ఆర్టీసీ

పుంగనూరు: దసరా సెలవులు, శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ బస్సులు నడపడంతో పుంగనూరు డిపోకు రూ.16.80 లక్షల ఆదాయం లభించినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది సహకారం, ప్రజలు ఆర్టీసీని అధికంగా వినియోగించుకోవడంతో డిపో తొలిసారిగా ఆదాయంలోకి వచ్చిందని తెలిపారు. డిపోను ఆదాయమార్గంలో నడుపుతున్న కార్మికులకు, ఉద్యోగులకు, ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీని వినియోగించుకోవాలని కోరారు.

ఆయిల్ విక్రయ కేంద్రాల ఏర్పాటు

గంగవరం: వంట నూనె ధరలు తగ్గిస్తూ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో విక్రయ కేంద్రాలను పలమనేరులో గురువారం అధికారులు ఏర్పాటు చేశారు. గోల్డ్ విన్నర్, సన్ ఫ్లవర్, పామాయిల్‌ను తగిన ధరతో విక్రయ కౌంటర్లను పట్టణంలో సిద్ధం చేశారు. వాటిని డీఎస్ఓ శంకరన్, తహసీల్దార్ ఇన్బనాథన్ కలసి ప్రారంభించారు. అన్ని షాపుల్లోను ఇదే రేట్లతో వంట నూనెలు విక్రయించాలని నిర్వాహకులను ఆదేశించారు.





